కారణజన్ముడు.. కేసీఆర్

- ఉమ్మడి జిల్లాలో ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు
- కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకొన్న గులాబీ దళం
- పెద్దఎత్తున పటాకులు కాల్చిన బీఆర్ఎస్ శ్రేణులు
- వృక్షార్చన కార్యక్రమంలో మొక్కలు నాటిన నాయకులు
- రోగులకు పాలు, పండ్లు పంపిణీ
- వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మెతుకు ఆనంద్, గుర్కజైపాల్ యాదవ్, గువ్వల బాలరాజు, అంజయ్యయాదవ్, పట్నం నరేందర్‌రెడ్డి, కొప్పుల మహేశ్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

వికారాబాద్ : కేక్ కట్ చేసి విద్యార్థినికి తినిపిస్తున్న బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 17 : దేశం మెచ్చిన గొప్ప నాయకుడు బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కేసీఆర్ జన్మదిన సందర్భంగా ఆయన ఫొటోతో ఏర్పాటు చేయించిన భారీ కేక్‌ను కట్ చేయించి బీఆర్ఎస్ శ్రేణులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా మంచిరెడ్డి మాట్లాడుతూ.. ఉద్యమాలతో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి, సాధించిన తెలంగాణను అతి తక్కువ కాలంలో అభివృద్ధిలో దేశంలోనే అగ్రగామిగా నిలిపారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో రైతు బంధు, రైతు బీమా, దళిత బంధు, బీసీ బంధు, కేసీఆర్ కిట్లు, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్‌తో పాటు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ప్రశాంత్‌కుమార్ రెడ్డి, మాజీ ఎంపీపీ కృపేశ్, మున్సిపల్ మాజీ చైర్మన్ భరత్‌కుమార్, మాజీ వైస్ చైర్మన్ యాదగిరి, పార్టీ మండల అధ్యక్షుడు బుగ్గరాములు, మాజీ ఎంపీటీసీ భరత్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేసీఆర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలి

వికారాబాద్ : వికారాబాద్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నాయకులతో కలిసి బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్ మొక్కలు నాటారు. అనంతరం వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని దన్నారం సమీపంలోని యజ్ఞ ఫౌండేషన్‌లో చిన్నారులతో కలిసి కేక్ కట్ చేశారు. కేక్‌ను విద్యార్థులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా కేసీఆర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు పదిమందికి ఉపయోగపడేలా మొక్కలు నాటడం, అన్నదానం, పండ్లు పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు, మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్, నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన నేత కేసీఆర్

కడ్తాల్ : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కారణజన్ముడని కల్వకుర్తి, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యేలు గుర్కజైపాల్‌యాదవ్, గువ్వల బాలరాజు అన్నారు. బీఆర్ఎస్ పార్టీ గ్రామాధ్యక్షుడు కడారి రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కేసీఆర్ జన్మదిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యేలతోపాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధాన చౌరస్తాలో పెద్దఎత్తున పటాకులు కాల్చారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేలు కేక్‌లు కట్ చేసి బీఆర్ఎస్ శ్రేణులకు తినిపించారు. అనంతరం మాజీ రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోశ్ కుమార్ పిలుపు మేరకు గ్రీన్ ఇండియా చాలెంజ్ నియోజకవర్గ ఇన్‌చార్జి లక్ష్మీనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో వృక్షార్చన కార్యక్రమంలో నాయకులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ.. పదేండ్ల పాలనలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని తెలిపారు. వాతావరణంలో సమతుల్యతను కాపాడటానికి గ్రీన్ ఇండియా చాలెంజ్ పేరిట మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్న సంతోశ్‌కుమార్, లక్ష్మీనర్సింహారెడ్డిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ వెంకటేశ్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్ గుప్తా, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ ఎల్ఎన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నిర్మల, రైతు సంఘం జిల్లా సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గోపాల్, మాజీ సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.



కడ్తాల్‌లో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, బాలరాజు



పరిగిలో మొక్క నాటి సెల్ఫీ దిగుతున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి



కొడంగల్ : ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

షాద్‌నగర్‌లో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

ఎల్లకాలం ఆరోగ్యంగా ఉండాలి

ఆమనగల్లు : ఆమనగల్లు, కోనాపూర్ గ్రామంలో మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, గువ్వల బాలరాజు, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ పాల్గొని నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు జై తెలంగాణ, లాంగ్ లివ్ కేసీఆర్ నినాదాలు చేశారు. తదనంతరం మొక్కలు నాటారు. అనంతరం ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. కేసీఆర్ ఎల్లకాలం ఆరోగ్యంగా ఉండాలని, బీఆర్ఎస్ పార్టీని శక్తివంతంగా తయారు చేసి తెలంగాణను పరిరక్షించాలన్నారు. తెలంగాణను ఏవిధంగా అయితే కేసీఆర్ సాధించారో, అభివృద్ధి కోసం ఎంత పరితపించారో.. తెలంగాణ కోసం అలాగే నిలబడి కొట్లాడుతారని వారు పేర్కొన్నారు. రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలీ శ్రీనివాస్‌రెడ్డి ఆమనగల్లు పట్టణంలో స్థానిక నాయకులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నిర్మల, మండల, పట్టణ అధ్యక్షులు అర్జున్‌రావు, నేనావత్ పత్యానాయక్, కార్యనిర్వాహక అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్, మాజీ ఏఎంసీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకులున్నారు.

తెలంగాణను దేశానికే దిక్సూచిగా నిలిపిన ఘనత కేసీఆర్‌ది

షాద్‌నగర్‌టౌన్ : పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేక్‌ను మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ కట్ చేయడంతోపాటు మొక్కలను నాటి నీళ్లు పోశారు. అదేవిధంగా పట్టణ ముఖ్య కూడలి వరకు నాయకులు, కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య కూడలిలో పెద్దఎత్తున పటాకులు కాల్చి కేక్ కట్ చేశారు. అంతకుముందు వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా ప్రతిభ జూనియర్ కళాశాలలో విద్యార్థినులతో కలిసి మొక్కలను నాటారు. పట్టణంలోని ప్రభుత్వ దవాఖానలోని రోగులకు పాలు, బ్రెడ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రజలను జాగృతం చేసి దశాబ్దాల కలను సాకారం చేసిన జాతిపిత కేసీఆర్ అని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో తెలంగాణను దేశానికే దిక్సూచిగా నిలిపిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. షాద్‌నగర్ మున్సిపాలిటీ 5వ వార్డు సోలిపూర్ గ్రామంలో కేసీఆర్ జన్మదిన వేడుకల సందర్భంగా చీపిరి రమేశ్‌యాదవ్, సింగపాగ వెంకటేశ్ కేక్ కట్ చేసి ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు నోట్ పుస్తకాలు, జామెట్రీ బాక్స్‌లను అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గణేశ్, కేశంపేట మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్, మున్సిపల్ మాజీ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ నటరాజ్, మాజీ కౌన్సిలర్లు, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు కిశోర్, సహకార సంఘం మాజీ చైర్మన్ రాజావరప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ సాధకుడు కేసీఆర్

కొడంగల్ : ప్రాణాన్ని పణంగా పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్‌ను తెలంగాణ ప్రజలు గుండెల్లో నిలుపుకొంటారని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేయడంతోపాటు స్థానిక సీహెచ్‌సీ ఆసుపత్రిలో మొక్కలు నాటి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సాధించుకున్న తెలంగాణకు తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి తెలంగాణ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి బాటలు వేసి అనతి కాలంలోనే తెలంగాణను దేశంలోనే నం.1 రాష్ట్రంగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ప్రజలు, రైతుల కష్టాలను స్వయంగా గుర్తించి ఎవరూ అడగకున్నా చరిత్రను సృష్టించే ఎన్నో అద్భుత పథకాలను అందించి బాసటగా నిలిచినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మహిపాల్, మాజీ సర్పంచ్ రమేశ్ బాబు, మాజీ వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, అడ్వకేట్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతిఒక్కరి గుండెల్లో కేసీఆర్

పరిగి : ఆరు దశాబ్దాల కలను సాకారం చేసి, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన నాయకుడు కేసీఆర్ అని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. పరిగిలో ఆయన మొక్కలు నాటారు. అనంతరం సర్కారు దవాఖానలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరో చెరిపేయాలనుకుంటే చెరిగిపోయేది కాదని, తెలంగాణలోని ప్రతి ఒక్కరి గుండెలో కేసీఆర్ ఉన్నారని తెలిపారు. తెలంగాణ ఉన్నంత వరకు కేసీఆర్ పేరు చిరస్థాయిగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అరవిందరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అజహరుద్దీన్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారు

కొత్తూరు : కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. కొత్తూరు మున్సిపాలిటీలో మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ కేక్ కట్ చేసి బీఆర్ఎస్ నాయకులకు తినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన సీఎం కేసీఆర్‌ను ప్రజలు ఎప్పటికీ మరువలేరన్నారు. అంతేకాకుండా కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు చేపట్టిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలు మళ్లీ మళ్లీ గుర్తుచేసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మున్సిపల్ వైస్ చైర్మన్ రవీందర్, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులున్నారు.



షాద్‌నగర్‌టౌన్ : సోలిపూర్ గ్రామంలో కేక్ కట్ చేసి విద్యార్థులకు నోట్ పుస్తకాలు, జామెట్రీ బాక్స్‌లను అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆమనగల్లులో మొక్క నాటుతున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలీ శ్రీనివాస్‌రెడ్డి

సేవాలాల్ బోధనలు ఆచరణీయం

సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, అధికారులు

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, ఫిబ్రవరి 17 : సంత్ సేవాలాల్ మహారాజ్ ఇచ్చిన బోధనలు, ఆచరణలను పాటిస్తూ సమాజ సేవకు ప్రతి ఒక్కరూ తోడ్పాటును అందించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో సంత్ సేవాలాల్ మహారాజ్ 286 జయంతిని పురస్కరించుకొని గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సమాజంలో సంచార జాతులుగా ఉండే బంజారాలను చైతన్యపరచడంలో కీలక పాత్ర పోషించారన్నారు. సంత్ సేవాలాల్ జంతు బలి నిషేధాన్ని ప్రచారం చేసిన గొప్ప అహింసావాదని తెలిపారు. గోవు ప్రాధాన్యతను గుర్తించి వాటిని కాపాడే దిశగా కృషి చేసిన మహనీయుడని కలెక్టర్ కొనియాడారు. అనంతపూర్ జిల్లా, గుత్తి మండలంలో జన్మించిన సేవాలాల్ ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల్లో పర్యటించి బంజారాల ఎదుగుదలకు ఎంతగానో కృషిచేసి బంజారాల ఆరాధ్య దైవంగా కీర్తించబడుతున్నారని ఆయన పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా పనిచేసిన వ్యక్తిగా, అదేవిధంగా మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా జంతుబలి నిషేధం కోసం కృషి చేసిన అహింసవాది అని కొనియాడారు. హిందూ ధర్మాన్ని కాపాడుకునే దిశగా అడుగులు వేసిన మహోన్నత వ్యక్తి సంత్ సేవాలాల్ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ట్రైనీ కలెక్టర్ ఉమా హారతి, డీఎండబ్ల్యూవో కమలాకర్‌రెడ్డి, డీఆర్డీవో శ్రీనివాస్, లీడ్ బ్యాంక్ మేనేజర్ యాదగిరి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిగి నుంచే కాంగ్రెస్ ప్రభుత్వ పతనం ప్రారంభం

పరిగి, ఫిబ్రవరి 17 : గ్రామపంచాయతీ ఎన్నికల్లో దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించకుంటే పరిగి నుంచే కాంగ్రెస్ ప్రభుత్వ పతనం ప్రారంభిస్తామని భారత దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్ పేర్కొన్నారు. సోమవారం పరిగిలో జరిగిన మండల రాజ్యాధికార సాధన సభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. చత్తీస్‌ఘడ్ తరహాలోనే తెలంగాణలోనూ పంచాయతీ ఎన్నికల్లో దివ్యాంగులకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించేంత వరకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై పోరాటం ఆగదని స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే దివ్యాంగుల పెన్షన్ రూ.6000లకు పెంచడంతోపాటు ఆర్టీసీలో వంద శాతం ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తామని, దివ్యాంగుల అట్రాసిటీ చట్టం 2016ను సమర్థవంతంగా అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఖాళీగా ఉన్న దివ్యాంగుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని విమర్శించారు. వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు పోతురాజు సుధీర్ మాట్లాడుతూ.. పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్‌ల సాధనకు ఎంతటి పోరాటానికైనా శ్రేణులు సిద్ధంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో పరిగి మండల శాఖ అధ్యక్షుడు చంద్రయ్య, నియోజకవర్గ ఇన్‌చార్జి లక్ష్మయ్య పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న గిద్దె రాజేశ్

పందెం కోళ్ల బహిరంగ వేలం

- రూ.16.60 లక్షలు పలికిన 84 కోళ్లు
- వేలం పాటలో పాల్గొన్న వారంతా కోడి పందెంరాయుళ్లకు సంబంధించిన వాళ్లే..
- ఇతరులను వేలం పాటలో పాల్గొనకుండా అడ్డుకున్న పందెంరాయుళ్లు
- స్థానికుడు వేలం పాటలో పాల్గొనడంతో అతడికి రూ.2 లక్షలు ఇచ్చి బయటకు పంపించిన వైనం

కోళ్ల వేలం పాటలో రాజేంద్రనగర్ కోర్టు వద్ద పాల్గొనడానికి వచ్చిన జనం

మొయినాబాద్, ఫిబ్రవరి 17 : పోలీసులకు పట్టుబడిన పందెం కోళ్లను న్యాయస్థానంలో న్యాయమూర్తి సమక్షంలో సోమవారం వేలం పాట వేశారు. పందెం కోళ్లను ఓపెన్ ఆక్షన్ పెట్టగా.. వాటిని దక్కించుకోవడానికి వందలమంది పోటీపడ్డారు. వేలం పాటలో పాల్గొనేవారు తమ పేర్లను నమోదు చేసుకుని పాల్గొన్నారు. పోలీసులకు పట్టుబడిన 84 పందెం కోళ్లను న్యాయమూర్తి వేలం పాట వేయగా రూ.16.60 లక్షల ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల పరిధిలోని తోలుకట్టా గ్రామంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో ఈ నెల 11న కోడిపందేలు నిర్వహిస్తున్న విషయాన్ని తెలుసుకున్న ఎస్‌వోటీ పోలీసులు, మొయినాబాద్ పోలీసులు సంయుక్తంగా కోడి పందేల శిబిరంపై దాడి చేసి 84 కోళ్లు, రూ.30 లక్షల నగదును స్వాధీనం చేసుకున విషయం తెలిసిందే. అయితే గత ఆరు రోజుల నుంచి పోలీసుల అదుపులో పెట్టుకున్న పందెం కోళ్లను హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ 13వ అదనపు జుడిషియల్ మెజిస్ట్రేట్ ప్రథమ కోర్టులో న్యాయమూర్తి అనుమతితో సోమవారం వేలం పాట వేశారు. వేలం పాటలో కోడి పందెంరాయుళ్లకు సంబంధించిన వ్యక్తులే పాల్గొని పందెం కోళ్లను దక్కించుకున్నారు. కోడి పందేలలో వినియోగించిన 84 కోళ్లు సుమారు 400 కేజీల వరకు ఉండగా.. రూ.16.60 లక్షల వరకు ఆదాయం వచ్చింది. 84 కోళ్లకుగాను ఒక రౌండ్‌కు 10 కోళ్ల చొప్పున తూకం చేసి 8 రౌండ్ల వరకు వేయగా.. 9వ రౌండ్‌లో 4 కోళ్లను వేలం పాట వేశారు.

సిండికేట్ అయిన పందెంరాయుళ్లు

పందెం కోళ్లు అత్యంత ఖరీదైనవి కావడంతో ఆ బీడ్ మరొకరికి దక్కనివ్వవద్దనే ఆలోచనతో కోళ్ల పందెంరాయుళ్లు వాళ్లే ఒక సిండికేట్‌గా ఏర్పడి కోళ్లను దక్కించుకున్నారు. 84 కోళ్లు సుమారుగా రూ.3 కోట్ల వరకు విలువ ఉంటుందని ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన పందెం కోళ్లరాయుళ్లు పేర్కొన్నారు. న్యాయమూర్తి న్యాయస్థానంలో కోళ్లను ఓపెన్ యాక్షన్ వేయగా అందరూ పాల్గొనే అవకాశం ఇచ్చారు. కోళ్ల పందెంరాయుళ్లతో పాటు కొందరు స్థానికులు కూడా వేలం పాటలో పాల్గొన్నారు. స్థానికంగా ఉండే ఓ యువకుడు వేలం పాటలో పాల్గొనడంతో పందెంరాయుళ్లు వేలం పాటలో పాల్గొనకుండా అడ్డుకోవడంతోపాటు కొంత భయభ్రాంతులకు గురి చేశారు. నన్ను అడ్డుకుంటే చివరి వరకు వేలం పాటలో పాల్గొంటానని మొండిగా వ్యవహరించాడు. దీంతో పందెంరాయుళ్లు ఆ కోళ్లను ఎవరికి దక్కనివ్వవద్దనే ఆలోచనతో ఆ యువకుడికి రూ.2లక్షలు ఇచ్చి అక్కడి నుంచి పంపించారు. చివరి మూడు రౌండ్ల నుంచి మొయినాబాద్ మండల పరిధిలోని సురంగల్ గ్రామానికి చెందిన కొత్తపల్లి విక్రంరెడ్డి వేలం పాటలో పాల్గొంటుండగా వేలలో పాల్గొనవద్దని కావాలంటే రెండు కోళ్లు ఇస్తామని ఆశ చూపారు. అయితే వినకుండా చివరి మూడు రౌండ్లలో వేలం పాటలో పాల్గొని వేలం పాటను పెంచి వదిలేశాడు.

రూ.15 వేల నుంచి లక్ష వరకు పెంచిన సర్కారువారి పాట

వేలం పాటలో స్థానికులు పాల్గొంటుండంతో వాళ్లను పాల్గొననివ్వకుండా అడ్డుకోవడంతోపాటు వాళ్లు సిండికేట్ అవడాన్ని న్యాయమూర్తి గమనించారు. పందెంరాయుళ్లు ఈ కోళ్లను ఎలాగైనా దక్కించుకుంటారని, ఎంత వరకు వేలం పాట వేసినా కోళ్లను వదిలే పరిస్థితి లేదని న్యాయమూర్తి గుర్తించారు. మొదటగా 3 రౌండ్ల వరకు సర్కారు పాట రూ.15వేలు పెట్టగా.. 4వ రౌండ్ నుంచి కోళ్లే డిమాండ్‌ను బట్టి ఏకంగా రూ.లక్ష నుంచి వేలం పాట వేయడం మొదలుపెట్టారు. అయినా పందెంరాయుళ్లు కోళ్లను వదలకుండా ఎంత పెట్టినా పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నారు.

వేలం పాట రౌండ్లవారీగా..

రౌండ్లు	కోళ్లు	వేలం పాట (రూ.లక్షల్లో)
1	10	2,50,000
2	10	3,70,000
3	10	1,15,000
4	10	1,30,000
5	10	1,80,000
6	10	1,92,000
7	10	1,71,000
8	10	1,10,000
9	4	1,42,000

వేలం పాట పాడి బుట్టల్లో కోళ్లను తీసుకెళ్తున్న ఓ వ్యక్తి